# మనసు మూగది!

## వేదాంతం శ్రీపతి శర్మ

పసిపిల్లలను రోజంతా చూస్కునే ఒక చిన్న కుటీరం అది. పేరుకు 'శాంతి కుటీరం' అయినా అక్కడ వాళ్లంతా సుందరమ్మ కుటీరమనే అంటారు. మామూలుగా ఆయాలు పిల్లలని ఆడిస్తూ ఉండటం కంటే ఎనభై పైబడ్డ సుందరమ్మగారు పసిపిల్లలను తన మీదనే ఎక్కించుకుని మరీ ఆడించే చోటు అది. అసలు ఆయాలకు అక్కడ పనే లేదు. ఆఫీసుల నుంచి అక్కడికి వచ్చి తల్లిదండ్రులు ఇంటికి తీస్కెళతామన్నా కొందరు పిల్లలు రాము అని పేచీ పెట్టే వారు. పిల్లల గోలతో గలగలమంటూ ఉండే ఆ కుటీరం ఒక్కసారిగా బోసిపోయింది. మాటా పలుకూ లేని సుందరమ్మగారి చుట్టూ ఏమీ తెలియని ఆ పిల్లలు ఒకటే మూగిపోయారు. ఇద్దరు ముగ్గురైతే మీద పడి చిట్టి చేతులతోనే కుమ్మేస్తున్నారు. ఆవిడ కదలటం లేదు. ఆ పిల్లలని అక్కడి నుండి వేరు చేయకుండా నలుగురు ఆయాలూ దూరంగానే నిలబడి భయంగా చూస్తున్నారు.

***

స్కూలు నుంచి రాగానే అమ్మ ఎందుకు నన్ను దగ్గరకు తీస్కోదు? ఆలోచించేది సుందరి. తన పరికిణీ బొందు ముడి తీయలేక పోతే మరల స్కూలుకే వెళ్లి తీయించుకుని రమ్మనేది! తను పెద్దదయిపోయిందా? ఎత్తుకోరా? ఏమో! బడ్డీకొట్టుకి వెళ్లొస్తూ వీధి చివార్న ఉన్న దర్జీవాని ఇంట్లోకి చూసేది. ఆ వరండాలో అతను మోకాళ్ల మీద చిట్టిపాపను ఎక్కించుకుని ఆడిస్తూ ఉండేవాడు. కాళ్లు పైకి లేస్తుంటే ఆ పాప భయంగా చూసేది, మరల దింపుతున్నప్పుడు ఆనందంతో కేరింతలు పెట్టేది. రెండు మూడుసార్లు అయ్యేవరకూ చూసి ఇంటికి వచ్చేది. ఎప్పుడైనా బజారు తీసుకెళ్లినప్పుడు నాన్న వేలు పట్టుకోమనేవాడు. జారిపోతే తిట్టి చెయ్యి

**చాలా మంది పిల్లలను గుండెల మీద పెంచుతారు. తన కొడుకు తన గుండె చప్పుడుకి నిద్ర లేస్తాడేమోనని కుడి భుజం మీద వాల్చుకుని జోల పాడేది. వాడు అన్ని మెట్లూ ఎక్కాడు. కార్లెక్కాడు, ఫ్లైటెక్కాడు. వాడి భార్య ప్రక్కన ఉంటే నా పాదాలను పూర్తిగా తాకాలన్నా వాడికి భయమే!**

పట్టుకుని గబగబా నడిపించేవాడు. జ్వరం వచ్చి పడుకుంటే ఒక సమయంలో వచ్చి మెడ మీద చెయ్యి పెట్టి 'తగ్గిపోతుంది... పోయింది' అనేవాడు. రోజులు గడచిపోయాయి. అన్నీ దూరాలే. అటు వెళ్లకు, ఇటు రాకు, ఇటు దొర్లకు, అటు లేవకు. అసలు ఇలా ఆలోచించకు! పెండ్లికొడుకును చూడకు. తలెత్తుతావా? నో! నీ పేరు కూడా నీకు తెలియదు. కానీ చెప్పాలి కాబట్టి నేలకే వినపడాలనుకుని చెప్పు! భర్త కూడా అదేంటో చేతిలోని మంచినీళ్ల గ్లాసు తన చేతిని అంటకుండానే పుచ్చుకునేవాడు. తను మామూలుగా ఏ సందర్భంలోనైనా కొద్దిగా దగ్గరైతే 'సినిమాలు ఎక్కువగా చూసేస్తున్నావు', అనేవాడు.

తను పెద్దగా చదువుకోలేదు. అందరూ దూరమయ్యారు. పాతకాలం దానిలాగా అప్పగింతలప్పుడు కూతుర్ని దగ్గరకు తీస్కుని ఏడవబోయింది. అమ్మాయి చెవిలో 'ఏంటది? మామూలుగా ఉండు... అబ్బా' అని నసిగింది. భర్త 'ఇంత వద్దు' అన్నట్లు చూశాడు.

చాలా మంది పిల్లలను గుండెల మీద పెంచుతారు. తన కొడుకు తన గుండె చప్పుడుకి నిద్ర లేస్తాడేమోనని కుడి భుజం మీద వాల్చుకుని జోల పాడేది. వాడు అన్ని మెట్లూ ఎక్కాడు. కార్లెక్కాడు, ఫ్లైటెక్కాడు. వాడి భార్య ప్రక్కన ఉంటే వాడికి తన పాదాలను పూర్తిగా తాకాలన్న భయమే! దెబ్బ తగిలితే 'అమ్మా' అనకూడదు. 'డార్లింగ్' అనాలి... అన్నీ దూరమే. జరిగిపోయినది తలచుకున్నా దూరమే, తలచుకోకపోయినా దూరమే. జరగనిది ఎప్పుడూ దూరమే. ఈ మనసుకు పని లేదు. దీనిలో ఆలోచనలు నిండినప్పుడు ఎందుకో దీనికి మాటా దూరమే! ఆ ఇంటిలో ఒంటరిగా దేనిని ఎలా వాటేసుకుంటుంది? మీద పడ్డ వయస్సునే గట్టిగా పట్టుకునేది సుందరమ్మ!

***

ఆలోచనే పిల్లలని పెట్టింది. ఇల్లు నిండిపోయింది. పది మంది, ఇరవై, ఎందరైనా ఫరవాలేదు. తనివితీరా నెత్తినపెట్టుకుంది. ఏడిచే పిల్లలు, ఎగిరి గంతులేసే పిల్లలు, పరుగులు తీసి పోట్లాడే పిల్లలు. నెలల పిల్లలు, వెన్నెలల పిల్లలు. ఏటేటో అంటూ ఏటేటా

సింగిల్ పేజీ కథ



పిల్లలు. ఏమైంది ఈరోజు? ఆవిడను చిట్టిచేతులతో కుదుపుతున్నారు. వాళ్ల తల్లిదండ్రులు వస్తున్నారు. గబగబా తీసుకుని వెళ్లిపోతున్నారు. ఒకావిడ పిల్లవాడిని తీస్కుని బయటకి వెళ్లి మరల లోపలికి వచ్చింది. ఆయాలవైపు కోపంగా చూసింది. 'అలా నిలబడకపోతే పిల్లలని ఇవతలకి లాగలేరా? బుద్ధి జ్ఞాన లేదూ?' అంటూనే వెళ్లి కార్లో కూర్చుంది. ఆయాలు తలలు వంచుకున్నారు. వాళ్లకి తెలీదా? తెలుసు. కానీ వాళ్లని పెట్టుకున్న సుందరమ్మ అటువంటి పరిస్థితిలో కూడా పిల్లలని తన శరీరం మీద నుండి కదపవద్దని చెప్పినట్లు మరి అందరికీ తెలీదు. అది ఆవిడ చివరి కోరిక...

కారు దూసుకుపోతోంది. పిల్లవాడు ఎన్నడూ లేనంతగా ఏడుస్తున్నాడు. తల్లి ఒకటే ఊపుతోంది. ఇళ్లల్లో ఎవరూ ఉండనప్పుడు ఇన్ని ఇళ్లెందుకో? రోడ్లు చిన్నవైనాయని వాటిని మరల పగలగొట్టటం ఎందుకో? పిల్లవాడు అలానే ఏదో నిద్రలోకి జారిపోయాడు. వాడిని వదలి వెళ్లినప్పుడూ అంత ఏడవడు. ఆ ఏడుపు వెక్కిరిస్తోంది. ఎంత లేదన్నా తల్లి వడి అది. దానికి ఫ్లింట్ ఏరియాతో పనిలేదు. మూగదైన ఏమి, ఏ తరాజుకూ తూగనిది ఆ మనసు. కొద్దిసేపైనా ఊగనీ...